ప్రజాశక్తి
గురువారం 1 ఫిబ్రవరి 2024

రూరల్ సిఐగా బాలకృష్ణ

ప్రజాశక్తి - సాలూరు

రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా గేదెల బాలకృష్ణను నియమిస్తూ విశాఖ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం ఇక్కడ సిఐగా పని చేస్తున్న ఎస్.ధనంజయరావును ఎన్నికల నేపథ్యంలో బదిలీ చేశారు. అలాగే కొటియా సిఐగా కె.నారాయణరావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతవరకు కొటియా సిఐగా ఉన్న రేవతీపతి కి బదిలీ అయింది.

క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకే

'ఆడుదాం ఆంధ్ర' పోటీలు : జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం

క్రీడాకారుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలుగులోకి తీసుకురావడానికే ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోందని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి జెసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం ఆడుదాం ఆంధ్రా అని జేసీ అన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఆడుదాం ఆంధ్రా పోటీల్లో పాల్గొని, గెలుపొంది, జిల్లా స్థాయికి వచ్చిన వారికి జెసి అభినందనలు తెలిపారు. జిల్లా స్థాయిలో కబడ్డీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని, వాటిలో కూడా గెలవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి ఉండాలని అదే మన భవిష్యత్‌ను నిర్దేశిస్తుందని అన్నారు. విశాఖలో రాష్ట్ర స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు జరుగుతాయని, జిల్లాలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొని, గెలిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఎటువంటి వివక్షతా లేకుండా పారదర్శకంగా పోటీలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. క్రీడల్లో తుది నిర్ణయం న్యాయ నిర్ణేతలదేనన్నారు. జిల్లా ప్రాధికారిక సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత రెండు నెలలుగా గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. అందులో గెలుపొందిన క్రీడాకారులకు జిల్లా స్థాయిలలో జరిగే ఆడుదాం ఆంధ్రా పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖధికారి బి.జగన్నాథరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసికస్థైర్యం, ఫిజికల్ ఫిట్నెస్ కలుగుతాయన్నారు. క్రీడల వల్ల ఆరోగ్య సమస్యలు రావని, ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. పిఇటి అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మురళి మాట్లాడుతూ క్రీడాకారులు మూడు స్థాయిల్లో గెలుపొందిన జిల్లా స్థాయికు వచ్చారని, కష్టానికి ఫలితం రావాలంటే రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొని, గెలవాలన్నారు. అనంతరం బాణాసంచాతో క్రీడాలను ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ క్రీడాకారులతో కలిసి వాలీబాల్, కబడ్డీ ఆడి వారిలో ఉత్సాహన్ని నింపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గౌరీశ్వరి, డిఇఒ ప్రేమ్‌కుమార్, పిఇటి అధ్యక్షులు పి.రామకృష్ణ, ఎస్‌జిటి సెక్రటరీ డిటి గాంధీ, కో-ఆర్డినేటర్ గోవిందరావు, నాలుగు నియోజకవర్గాల క్రీడాకారులు పాల్గొన్నారు.

కబడ్డీ ఆడుతూ పోటీలు ప్రారంభిస్తున్న జెసి గోవిందరావు

జాతీయ పతకాన్ని ఎగురు వేస్తున్న జెసి, అధికారులు

బాగా చదవండి... పరీక్షలకు సిద్ధం కండి

ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యాన 10న ప్రజ్ఞా వికాస పరీక్ష

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యాన ఈనెల 10న టెన్త్ విద్యార్థులకు జిల్లావ్యాప్తంగా ప్రజ్ఞా ప్రజ్ఞా వికాసం పరీక్ష నిర్వహించనున్నట్టు ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ నాయకులు తెలిపారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో పరీక్షకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.రాజు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తోట రమేష్ మాట్లాడుతూ ప్రధాన పరీక్షల్లో పదో తరగతి పరీక్షలు కీలకమని, ఎంతటి మేధావులైన ఉత్తీర్ణత చదువులకై టెన్త్ పరీక్షల నుండే ప్రారంభమవుతారని అన్నారు. అటువంటి కీలకమైన పరీక్షల్లో విద్యార్థులు ఒత్తిళ్లకు, భయాందోళనకు గురికాకుండా వారిలో ఉన్న సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు ఎస్ఎఫ్ఐ - యుటిఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా జిల్లాలో పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాస పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. కావున ప్రతి విద్యార్థి తప్పకుండా పాల్గొని తమ ప్రతిభను గుర్తుంచుకోవాలని అన్నారు. అలాగే ఈ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతిగా మొదటి స్థానానికి రూ.5వేలు, రెండో స్థానానికి రూ.3వేలు, మూడో స్థానానికి రూ.2వేలు బహుమతిగా ఇవ్వనున్నట్టు తెలిపారు. అలాగే మండల స్థాయిలో 200మంది విద్యార్థులు పరీక్ష రాస్తే మొదటి మూడు స్థానాలకు మెమొంటోలు ఇస్తామన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు ఫిబ్రవరి 7లోపు ఫీజు రూ.25 చెల్లించి మీ పేర్లు నమోదు చేసుకొని, హాల్ టిక్కెట్లు తీసుకోవాలని అన్నారు. ఈ పరీక్షా పత్రంలో అన్ని సబ్జెక్టులపైన ప్రశ్నలు ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఒఎంఆర్ షీట్ విధానంలో ఉంటాయని, సబ్జెక్టల వారీగా మార్కులు మేథ్స్- 20, సోషల్ స్టడీస్-20, ఇంగ్లీషు-20, ఎన్.ఎస్-10, పి.ఎస్-10, తెలుగు-10, హిందీ-10 మొత్తం కలిపి 100 మార్కులకు పరీక్ష ఉంటుందని, జిల్లా వ్యాప్తంగా పరీక్ష రాసే విద్యార్థులు ఈ ఫోన్ నెంబర్లను 9440565436, 7671994813 సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎ.గంగారాం, సహాయకార్యదర్శి అఖిల్, సింహాచలం, జిల్లా కమిటీ సభ్యులు కె.భాస్కర్, పి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: ఈనెల 10న జిల్లా వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యాన పదోతరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాస పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.అఖిల్, డివిజన్ కార్యదర్శి వరుణ్ చెప్పారు. దీనికి సంబంధించిన కరపత్రాలను బుధవారం బంగారమ్మ పేటలో ఎస్టీ పోస్ట్ మెట్రిక్ హాస్టల్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 7లోగా ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ప్రజ్ఞా వికాస పరీక్ష కరపత్రాలు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

18 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి : జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం

18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని జాయింట్ కలెక్టరు ఆర్.గోవిందరావు తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో వారాంతపు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ జనవరి 22న ఓటరు జాబితా తుది ప్రచురణ విడుదల చేశామని, అయినా నామినేషన్ల చివరి తేది వరకు ఫారం-6 ద్వారా కొత్త ఓటర్లుగా చేరేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వారి పేర్లను సప్లిమెంటరీ జాబితా ద్వారా విడుదల చేస్తామన్నారు. కావున 18ఏళ్లు దాటిన ప్రతి ఒక్కర్ని ఓటరుగా నమోదు చేయాలని జెసి తెలిపారు. ఓటరు జాబితాలో పేరు, అడ్రసు మార్పు, సవరణలు చేసి సరిదిద్దుటకు అవకాశం ఉందని, కావున ఓటరు జాబితాలో అటువంటివి ఉంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ దృష్టికి తీసుకొస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. శుద్ధమైన ఓటరు జాబితా తయారీ ప్రక్రియలో ప్రతి విషయాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల దృష్టికి తీసుకురానున్నట్టు తెలిపారు. పత్రికల్లో వచ్చే కథనాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని జెసి తెలిపారు. డిఆర్‌డి జె.వెంకట్రావు మాట్లాడుతూ 2024 జనవరి 1నాటికి ప్రతిపాదిత ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో నాలుగు నియోజకవర్గాలలో 7,75,598 మంది కాగా వారిలో 3,78,764 మంది పురుషులు, 3,96,766 మహిళలు, 68 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారని తెలిపారు. జనవరి 13వ నుండి 30 వరకు జిల్లాలో మరో 1575 ఫారాలు స్వీకరించగా, వాటిలో 118 ఫారాలు పరిష్కరించి ఓటరు జాబితాలో చేర్చామని, 3 ఆమోదించామని, 12 తిరస్కరణకు గురయ్యాయని, మిగిలిన 1442 పరిష్కరించాల్సి ఉందని తెలిపారు. వీటిలో 69 చేర్పులు, 8 తొలగింపులు, 41 సవరణలు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి

కలెక్టరేట్ వద్ద విఒఎల ధర్నా

ప్రజాశక్తి - బెలగాం

వెలుగు విఒఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక కలెక్టరేట్ వద్ద బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో విఒఎలు ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, నాయకులు వాకాడ ఇందిర, కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విఒఎల సమస్యపైన శీతకన్ను వేయడం అన్యాయమని, ఇలాంటి సందర్భంలో విఎఒలను ప్రాజెక్టు స్టాఫ్ గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈరోజు ప్రాజెక్ట్ స్టాఫ్ చేసే అన్ని పనులు తాము చేస్తున్నామని, అలాగే ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. కావున మూడేళ్ల కాల పరిమితి జిఒను రద్దు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ప్రతిరోజు గ్రామాలకు వెళ్లి విధులు నిర్వహిస్తున్న సందర్భంలో విఒఎలకు ఏమైనా జరిగితే దానికి సంరక్షణగా రూ.10 లక్షలు ఇన్సూరెన్స్ కల్పించాలని, ఆన్లైన్ వర్క్ గాను ట్యాబ్స్ కల్పించాలని, అలాగే న్యాయమైన సెల్ ఫోన్ ఇవ్వాలని, అలాగే నెట్‌బిల్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే విఒఎ గౌరవ వేతనం రూ.8వేలు గ్రామ సంఘాలకు కాకుండా వ్యక్తిగత ఖాతాలకు జమ చేయాలని, జెండర్‌తో సంబంధం లేకుండా ప్రస్తుతం పని చేస్తున్న విఒఎలందర్నీ రెగ్యులర్ చేయాలని, అలాగే టిఎ, డిఎ కూడా ఇవ్వాలని కోరారు. పై సమస్యల పరిష్కారం కోరుతూ అమరావతిలో ఇప్పటికే 36గంటల విఒఎలు ధర్నా చేపట్టారని, దీనికి మద్దతుగా బుధవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ తోపుడు బండి అధ్యక్షులు సూరిబాబు, విఒఎల పార్వతీపురం, కొమరాడ, సీతానగరం, కురుపాం మండలశాఖల అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారులు గండి శిరీష, బి.భారతి, బి.రజిని, టి.సుహాసిని, ఎం.స్వర్ణకుమారి సిహెచ్ నిర్మల, ఇ.అనిత, జె.జగదీశ్వరి, కె.జయమ్మ, పి.వరలక్ష్మి, పి.పద్మ, పి చంద్రకళ, ఆయా మండలాల్లో పనిచేస్తున్న విఒఎలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పట్టణంలో ర్యాలీ చేస్తున్న యానిమేటర్లు

జాబ్‌మేళాకు భారీ స్పందన

ప్రజాశక్తి-విజయనగరం

వచ్చే రెండేళ్లలో జిల్లాలో యువతకు కనీసం పది వేల నుంచి ఇరవై వేల కొత్త ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చెప్పారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం 2026 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని, ఈ ప్రాజెక్టు ద్వారా సేవారంగంలో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. కొత్తవలస సమీపంలో త్వరలో వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో వస్తున్న జిందాల్ పారిశ్రామిక పార్కు ద్వారా కూడా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంతీయ జాబ్ మేళాను బుధవారం నైపుణ్యాభి వృద్ధి సంస్థ ఎమ్‌డి వి.వినోద్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఆరు జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఉన్న డాక్టర్ రెడ్డీస్, అరబిందో ఫార్మా, హెటెరో వంటి 87 సంస్థలు ఇందులో పాల్గొంటున్నాయని చెప్పారు. ఎమ్‌డి వి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 600 నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థలు నమోదయ్యాయన్నారు. ఒక్కో జిల్లాలో 20 కేంద్రాల వరకు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. యువత ఎపి స్కిల్ యూనివర్సల్ అప్లికేషన్ తమ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకొని అందులో వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా యువత ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ఈ జాబ్‌మేళాకు 4 వేల మంది హాజరు అవుతారని, దీని ద్వారా కనీసం రెండు వేల మందిని ఉద్యోగాలకు ఎంపిక చేయాలని భావిస్తున్నామని చెప్పారు. జాబ్‌మేళాకు వచ్చిన ప్రతి అభ్యర్థి ఉద్యోగంతో ఇంటికి వెళ్లాలని ఆశిస్తున్నట్టు సీతం కళాశాల కరస్పాండెంట్ మజ్జి శశిభూషణరావు అన్నారు.

డంపింగ్‌యార్డు సమస్యపై

అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో బుధవారం చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి అధ్యక్షత జరిగిన కౌన్సిల్ సమావేశంలో డంపింగ్‌యార్డు తరలింపుపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం సాగింది. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కాలేదని, దీనివల్ల తాత్కాలిక డంపింగ్ యార్డు తమ వార్డుల్లో ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రతిపక్ష సభ్యులు గంటా సంతోష్, కొడాల రాంబాబు సభలో నిలదీశారు. తమ వార్డుల్లో గడప గడపకు కార్యక్రమం కూడా చేపట్టలేదని, ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ సభ్యుల వార్డుల్లో రూ.40లక్షలు చొప్పున నిధులను మంజూరు చేశారని, తమ పట్ల వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. దీనిపై అధికార పార్టీ సభ్యులు వెలమల మన్మధరావు, దుప్పాడ పాపినాయుడు అడ్డుతగిలారు. చైర్‌పర్సన్ వార్డులో కూడా గడప గడపకు పూర్తయిన నిధులు మంజూరు కాలేదని, తమకు ఎటువంటి వివక్షత లేదని అన్నారు. గత ప్రభుత్వం పూర్తిగా సమస్యలను గాలికి వదిలేసిందని, అప్పట్లో మీరెందుకు డంపింగ్ యార్డు సమస్య పరిష్కారించలేదని ప్రతిపక్ష సభ్యులను అధికార పార్టీ సభ్యులునిలదీశారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఉన్నప్పటికీ డంపింగ్ యార్డు సమస్య పరిష్కారించక పోవడం విడ్డూరంగా ఉందని ప్రతిపక్ష సభ్యులు గంటా సంతోష్ అన్నారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో రూ.52కోట్లు కేటాయించిందని, ఇంతవరకు రూపాయి పనికూడా జరగలేదని సంతోష్ ఆరోపించారు. దీంతో బహిరంగ చర్చకు రావాలని అధికార పార్టీ సభ్యులు సవాల్ విసిరారు. తాము ఎక్కడికైనా వస్తామని, మీరు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని ప్రతిపక్ష సభ్యులు పట్టు పట్టారు. అలాగే పాలకొండలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా ఎందుకు పట్టించుకోవట్లేదని సభ్యులు సంతోష్ నిలదీశారు. దీనిపై పరిశీలిస్తామని కమిషనర్ సర్వేశ్వరరావు అన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్లు రౌతు హనుమంతురావు, పల్లా ప్రతాప్, కౌన్సిలర్లు ఉన్నారు

నిందితుల నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొన్న పోలీసులు

24 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - పాచిపెంట

ఒడిశాలోని జైపూర్ నుంచి ఉత్తరప్రదేశ్‌కు అక్రంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులు నుంచి 24 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ ధనుంజయరావు తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం స్థానిక ఎస్సై నారాయణరావు, సిబ్బంది కలిసి పి.కోనవలస చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఘాట్ రోడ్డు మీదుగా బ్యాగులతో కాలినడకన వస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన జితేంద్ర కుమార్. రహేరాజ్ పుట్ బోలా నది అనే ముగ్గురు వ్యక్తులు చెక్ పోస్ట్ మీదుగా వస్తున్న వారిని తనిఖీ చేయగా 24 కేజీలు గంజాయి లభ్యమైంది. ఈ మేరకు గంజాయి స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.

ఉద్యోగాల విప్లవం తీసుకొచ్చిన సిఎం : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో సిఎం జగన్‌మోహన్ రెడ్డి ఉద్యోగాల విప్లవం తీసుకొచ్చారని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. బుధవారం మంత్రివర్గ సమావేశం అనంతరం ఆయన స్థానిక విలేఖర్లతో ఫోన్‌లో మాట్లాడారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో భర్తీ చేయనన్ని ఉద్యోగాలను ఈ ఐదేళ్లలో భర్తీ చేసినట్లు చెప్పారు. తాజాగా 6100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. 1998, 2018 డిఎస్‌సి నియామకాలకు సంబంధించి మిగులు పోస్టులు 14వేలు భర్తీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. ఇటీవల ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో, పాలిటెక్నిక్ కళాశాలలో లెక్చరర్ పోస్టులు భర్తీ కి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు. సచివాలయాల్లో శాశ్వత ప్రాతిపదికన 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేసినట్లు చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ లో 60వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. ఇవేకాక పోలీస్‌శాఖలో వేలాది కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. టిడిపి ప్రభుత్వం హయాంలో ఇన్ని ఉద్యోగాలు భర్తీ చేసినట్లు ఆ పార్టీ నాయకులు చెప్పగలరా అని ప్రశ్నించారు. చంద్రబాబు కొడుకు లోకేష్‌కు మూడు ఉద్యోగాలు ఇచ్చుకున్నారని, యువతకు మాత్రం ఉద్యోగాలు ఇవ్వలేదని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైసిపి మళ్లీ అధికారంలోకి వస్తే యువత భవిష్యత్తుకు గ్యారెంటీ వుంటుందని డిప్యూటీ సీఎం రాజన్నదొర చెప్పారు.

మహిళా క్రికెట్ జట్టుకు అభినందనలు

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి మహిళా క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన పాచిపెంట మహిళా క్రికెట్ జట్టును డిప్యూటీ సిఎం రాజన్నదొర అభినందించారు. జిల్లా స్థాయి ఫైనల్ మ్యాచ్లో కొమరాడ జట్టుపై విజయం సాధించిన పాచిపెంట జట్టు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. పట్టణానికి వచ్చిన తర్వాత జట్టు సభ్యులను ప్రత్యేకంగా అభినందిస్తానని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా పాచిపెంట జట్టు విజేతగా నిలబడాలని రాజన్నదొర ఆకాంక్షించారు.

మాత,శిశు ఆరోగ్య శ్రేయస్సుకు కృషి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మాతా,శిశు ఆరోగ్య శ్రేయస్సుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో ఆశా నోడల్ అధికారులకు బుధవారం నిర్వహించిన సమావేశంలో డాక్టర్ జగన్నాథరావు పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష చేశారు. గర్భిణీల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలు, వైద్య సేవలను పక్కగా నిర్వహించాలన్నారు. హై రిస్క్ గర్భిణీలను త్వరగా గుర్తించాలంటే గర్భిణీల నమోదు త్వరితగతిన జరగాలని, వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి నెలా నిర్వహిస్తున్న పిఎంఎస్ఎంఎ కార్యక్రమం ద్వారా గర్భిణీ లకు పూర్తి స్థాయిలో ఆరోగ్య తనిఖీలు చేపట్టాలన్నారు. టిడి వ్యాక్సిన్ రెండు డోసులు నెల వ్యవధిలో వేయించాలని, ఐరన్ ఫోలిక్ యాసిడ్, కాల్షియం మాత్రలు ప్రతీ రోజూ వేయించాలన్నారు. రక్త హీనతగా గుర్తించిన గర్భిణీలకు ఆసుపత్రిలో చికిత్స కొరకు తల్లి-బిడ్డ ఎక్స్ప్రెస్ వాహనం వినియోగించాలన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలందరికీ షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయాలన్నారు. గర్భిణీ, శిశు ఆరోగ్య విషయంలో అలసత్వం వహిస్తే తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పర్యవేక్షణలో అలసత్వం వహించిన నలుగురు సూపర్ వైజర్స్ కు మెమోలు జారీ చేశారు.

కార్యక్రమంలో డిఐఒ నారాయణరావు, డిపిహెచ్ఎన్ఓ ఉషారాణి, సన్యాసిరావు, విజయలక్ష్మి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

తాత్కాలిక పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పార్వతీపురం

సాధారణ ఎన్నికల నిర్వహణకు గానూ తాత్కాలిక పోస్టుల భర్తీకి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు నిశాంత్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏడు డేటా ఎంట్రీ ఆపరేటరు పోస్టులకు, 7 ఆఫీసు సబార్డినేట్ పోస్టులకు అవుట్ సోర్సింగు ప్రాతిపదికపై 8నెలల కాలానికి పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటరుకు డిగ్రీ, కంప్యూటరు పరిజ్ఞానం ఉండాలన్నారు. ఆఫీసు సబార్డినేట్ పోస్టులకు టెన్త్ లేదా తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలని తెలిపారు. దరఖాస్తు ఫారాలను http://parvathipuram-manyam.ap.gov.in వెబ్సైట్ నుండి పొందవచ్చునని, పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 8 సాయంత్రం 5గంటల్లోపు పరిపాలనాధికారి, జిల్లా కలెక్టరు కార్యాలయం, పార్వతీపురం మన్యం వారికి నేరుగా అందజేయవచ్చునని లేదా రిజిస్టరు పోస్టులో పంపించాలని తెలిపారు. తప్పుడు సమాచారం అందజేసిన, సిఫార్సులు చేసిన దరఖాస్తులను తిరస్కరించనున్నట్టు తెలిపారు.

సర్వే సక్రమంగా చేపట్టండి

ప్రజాశక్తి - పాలకొండ

కులగణ సర్వే సక్రమంగా చేపట్టాలని నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. బుధవారం నగర పంచాయతీ పరిధిలో జరుగుతున్న కులగణ సర్వేను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే జరుగుతున్న తీరుతెన్నులను పరిశీలించారు. సర్వే సక్రమంగా చేపట్టి, సమగ్ర వివరాలను నమోదు చేయాలన్నారు. ఎక్కడా ఎటువంటి లోపాలు లేకుండ చూసుకోవాలని అన్నారు.

హుండీ లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

పోలమాంబ హుండీ ఆదాయం రూ.25.59 లక్షలు

ప్రజాశక్తి - మక్కువ

శంబర పోలమాంబ అమ్మవారి జాతర సందర్భంగా భక్తుల సమర్పించుకునే ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. దేవాదాయశాఖ జిల్లా అధికారి డివివి ప్రసాదరావు, తనిఖీదారు ఎన్.రాజకుమారి, ఆలయ ఇఒ వివి సూర్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక చదురు గుడిలో ఈ లెక్కింపు జరిగింది. రెండు వారాలకు సంబంధించి రూ.25 లక్షల 59వేల 843 ఆదాయం లభించినట్లు ఇఒ వెల్లడించారు. గత ఏడాదిని బట్టి పోల్చి చూస్తే సుమారు రూ.4 లక్షలు పైబడి ఆదాయం ఎక్కువ వచ్చినట్టు పట్టిక పట్టి తెలుస్తుంది. లెక్కింపులో తహశీల్దార్ సూర్యనారాయణ. ఎస్ఐ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇ-పంట నమోదు పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చినభోగిలి లో రబీ సీజన్‌కు సంబంధించిన ఇ-పంట నమోదును ఆర్‌డిఒ కె.హేమలత బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కజొన్న, అరటిపంటను ఇ-పంట నమోదు చేయాలన్నారు. రైతులు నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని మండలం వ్యవసాయ అధికారి ఎస్.అవినాష్, సిబ్బందికి సూచించారు. అలాగే 124,125,126, 127,128, పోలింగ్ కేంద్రాల ను పరిశీ లించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్‌వి రమణ, ఇఒపిఆర్‌డి కెకెకె వర్మ పాల్గొన్నారు.

తహశీల్దార్ బదిలీ

ప్రజాశక్తి-పాలకొండ

మండల తహశీల్దార్ పి.సోమేశ్వరరావు బదిలీ అయ్యారు. దాదాపు మూడేళ్లకు పైగా తహశీల్దార్‌గా పని చేస్తూ ఉన్న ఈయన్ను ఎన్నికల ప్రక్రియలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ చేశారు. పాలకొండలో పని చేసిన కాలంలో వివాదరహితుడుగా పేరు పొందారు. రెవెన్యూపై పట్టు సాధించమే కాకుండా ప్రజల్లో కూడా మంచి అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారు.

చంద్రబాబు పాలనకే ప్రజల మద్దతు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలనపై విసుగు చెందిన ప్రజలు చంద్రబాబు పాలన కోసం ఎదురుచూస్తున్నారని పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయచంద్ర అన్నారు. బుధవారం సూడిగాం పంచాయతీ మూడడ్లవలసలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఇంటింటికి వెళ్లి టిడిపి అమలు చేయబోయే పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాన్యుల బతుకులను భారం చేస్తూ అధిక ధరలు అస్తవ్యస్త పరిపాలనతో ప్రజలు విసిగిపోయి ఉన్నారని, అన్ని వర్గాల ప్రజలు చంద్రబాబు పాలన కోసం ఎదురుచూస్తున్నారని అందుకు టిడిపికి రాష్ట్రంలో లభిస్తున్న ఆదరణ సాక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు బోను చంద్రమౌళి, పోల సత్యనారాయణ నాయకులు పాల్గొన్నారు.

సేల్స్‌మేన్లు సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన సహకార మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న డిఆర్ డిపోల్లో విధులు నిర్వహిస్తున్న సేల్స్‌మేన్లు, డీలర్లు సమయపాలన పాటించాలని పార్వతీపురం డివిజనల్ మేనేజర్ వి.మహేంద్ర కుమార్ కోరారు. బుధవారం ఆయన స్థానికబ్రాంచ్ కార్యాలయంలో సేల్స్ మాన్లు, డీలర్లు, గ్యాస్ గోదామ్ ఇన్చార్జి, ఎం ఎల్ ఎస్ గోదాము ఇంచార్జ్, పెట్రోల్ బంక్ ఇంచార్జ్‌లు, ఆఫీసు సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిసిసి సిబ్బంది డిపోలో సమయపాలన పాటించి కార్డుదారులందరికీ నిత్యవసర వస్తువులను అందించాలని అన్నారు. అలాగే నిత్యవసర సరుకులు అమ్మకాలు, రానున్న ఎంఎఫ్‌పి సీజన్ను దృష్టిలో ఉంచుకొని అటవీ ఫలసాయాల కొనుగోలు గురించి చర్చించారు. ఆయన వెంట బ్రాంచి మేనేజర్ కృష్ణ ప్రసాదరావు, గోదాం ఇన్చార్జి సాంబశివరావు, అకౌంటెంట్ గణపతి రావు తదితరులు ఉన్నారు.

సచివాలయాలు, ఆర్‌బికెలతోనే గ్రామ స్వరాజ్యం

ప్రజాశక్తి - కురుపాం

సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

సచివాలయాలు, ఆర్‌బికె వ్యవస్థలోనే గ్రామ స్వరాజ్యం వచ్చిందని స్థానిక ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి అన్నారు. కురుపాంలో రూ.కోటీ 42లక్షలతో నిర్మించిన ఆర్‌బికె కేంద్రం, బియ్యాల వలసలోని సచివాలయం, రైతు భరోసా కేంద్రం, కిచ్చాడ సచివాలయం, ఆర్‌బికెలను బుధవారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలకు సచివాలయాలు, రైతులకు ఆర్‌బికె సేవలు నేరుగా గ్రామాల్లో వారి ఇంటి వద్దకే అందిస్తున్నట్లు తెలిపారు. కావున రానున్న ఎన్నికల్లో కచ్చితంగా తమ ప్రభుత్వాన్ని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జడ్పిటిసి జి.సుజాత, స్థానిక సర్పంచులు జి.సుజాత, గవర రాజ్యలక్ష్మి, శెట్టి సురేష్‌కుమార్, పువ్వుల ఆజారి, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అందవరపు కోటేశ్వరరావు, మండల కన్వీనర్ ఐ.గౌరీ శంకర్, అయ్యర్కుల కార్పొరేషన్ డైరెక్టర్ జి.విజయ్ చంద్రశేఖర్, ఎంపిటిసి సభ్యులు వి.బంగారనాయుడు, జి.విద్యారాణి, వైసిపి నాయకులు షేక్ నూరేళ్ల తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు ఐక్యంగా కృషి

ప్రజాశక్తి - కురుపాం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి - జనసేన ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు అంతా కలిసికట్టుగా పనిచేద్దామని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్‌చంద్రదేవ్ అన్నారు. బుధవారం కురుపాంలో గల ఆయన కోట వద్ద జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కడ్రక మల్లేష్, ఐదు మండలాల జనసేన కన్వీనర్లు, నాయకులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు అంతా కలిసికట్టుగా పనిచేస్తూ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉమ్మడి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయడానికి సైనికుల ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి మాజీ ఎంపి వైరిచర్ల ప్రదీప్ చంద్రదేవ్, టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య, టిడిపి నాయకులు, జనసేన నియోజకవర్గ నాయకులు ఎన్.వంశీ, జి.గౌరి, ఐదు మండలాల జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేసే వారికే ప్రజల మన్ననలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

క్రమశిక్షణ, బాధ్యతతో పనిచేసిన అధికారులు ప్రజల మన్ననలు పొందుతారని ఎంపిపి కె.దీనమయ్య అన్నారు. స్థానిక ఎంపిడిఒ సాల్మన్‌రాజు బదిలీపై వెళ్తున్న సందర్భంగా వీడ్కోలు సన్మానసభ బుధవారం ఏర్పాటు చేశారు. నాలుగేళ్లలో మండల అభివృద్ధికి కృషి చేస్తూ నాలుగుసార్లు ఉత్తమ అధికారిగా అవార్డులు పొందడం ఆయన పని, కృషికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి రాధిక, వైస్ ఎంపిపిలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, బిసి రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి గిరిబాబు, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఎస్‌పి సత్కారం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

అంకిత భావంతో పోలీసుశాఖకు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పదవీ విరమణ పొందిన సిహెచ్.వెంకటరావు (సీనియర్ అసిస్టెంట్ (డిపిఒ), ఎన్.శంకర్ రావు (అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ గరుగుబిల్లి)ను సన్మానించారు. కార్యక్రమంలో ఎఎస్పీ ఒ. దిలీప్ కిరణ్, ఏఆర్ డిఎస్పీ శేషాద్రి, సిఐ సిహెచ్.లక్ష్మణరావు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

మాఘ హేలా కరపత్రాల ఆవిష్కరణ

పార్వతీపురం టౌన్ : పట్టణ శివారులో గల సూర్య పీఠంలో మాఘహేలా శ్రీ సూర్యవైభవ వార్షికోత్సవ కరపత్రాన్ని స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు బుధవారం ఆవిష్కరించారు. తొలుత జ్యోతిప్రజ్వలనం, ఆదిత్య పంచాయతన క్షీరాభిషేకం, శ్రీ ఉషా పద్మినీ సమేత శ్రీ సూర్య నారాయణ స్వామి ఉత్సవమూర్తులకు వేదపూర్వక పష్పాంజలి నిర్వహించారు. అనంతరం కరపత్ర ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి వేమకోటి నరహరిశాస్త్రి మాట్లాడుతూ ఫిబ్రవరి 15న సహస్ర కలశాభిషేకం, ద్వాదశాదిత్య, విశ్వశాంతి హెూమాదులు, 16న రథసప్తమి సందర్భంగా సూర్యభగవానుని కల్యాణోత్సవం, సహస్ర దీపాలంకార, ఊంజల్, పూలంగి సేవలు, శ్రీ సత్యసాయి సేవా సమితి, వికాస తరంగిణి సభ్యులచే సామూహిక స్తోత్ర పారాయణలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

గిరిజనాభివృద్ధికి పెద్దపీట

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతంపేట

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పాలకొండ ఎమ్మెల్యే పి.కళావతి అన్నారు. బుధవారం స్థానిక వైటిసిలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి బిడ్డిక ఆదినారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గిరిజన గ్రామాల అభివృద్ధికి అధికారులు సహకరించాలని కోరారు. ఆరోగ్యశ్రీ కార్డులు అందించాలని సర్పంచుల ఆదిలక్ష్మి, సుందరమ్మ సభ దృకి తీసుకువచ్చారు. మర్రిపాడు వైద్యాధికారి సాయి చరణ్ కొత్తవి ఇంకా రాలేదని సమాధానమిచ్చారు. దోనుబాయి సర్పంచ్ వెంకనాయుడు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష జరగడంలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. సబ్సిడీ యంత్రాలు వ్యవసాయ శాఖలో ఇవ్వడం లేదని విత్తనాలు ఆలస్యంగా వచ్చాయని గొయిది ఎంపిటిసి హరిబాబు సభ దృష్టికి తీసుకొచ్చారు. మండల వ్యవసాయాధికారి శ్రీదేవి మాట్లాడుతూ మూడేళ్లుగా సబ్సిడీ పనిముట్లు, యంత్రాలు రావడంలేదని తెలిపారు. రెవెన్యూ శాఖ ద్వారా 242 పట్టాలు ఇచ్చామని డిప్యూటీ తహశీల్దార్ నాగేంద్రకుమార్ తెలిపారు. భూములు రీసర్వే చేయాలని పెద్దూరు సర్పంచ్ ఆదిలక్ష్మి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ధారపాడు సర్పంచ్ సుందరమ్మ, ఎంపిటిసి సభ్యులు కోటేశ్వరరావు గ్రామాల్లో భూ మ్యుటేషన్ జరగడం లేదన్నారు. ఎంపిపి ఆదినారాయణ మాట్లాడుతూ మండలంలో ఎక్కడా జరగడం లేదని చెప్పారు. డిటి మాట్లాడుతూ సిగ్నల్ సమస్య ఉందని తెలిపారు. ధారపాడు సర్పంచ్ సుందరమ్మ మాట్లాడుతూ నాడు-నేడులో అంగన్వాడీ భవనాలు పునాదులుకే పరిమితమయ్యాయని అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో మండలానికి సంబంధించిన ప్రధాన సమస్యలను వివిధ శాఖల వారీగా సమీక్షించారు. సమావేశంలో జెడ్పిటీసీ లక్ష్మి, వైస్ ఎంపిపి విజయలక్ష్మి, ఎఎంసి చైర్మన్ మోహన్‌రావు, ఎంపిటిసి చంద్రశేఖర్, పగడాలమ్మ సర్పంచ్ కళావతి, ఎంపిడిఒ గీతాంజలి, ఇఒపిఆర్‌డి సత్యం, డిఇ కృష్ణకుమార్, వైద్యాధికారులు భానుప్రతాప్, సాయిచరణ్, జెఇలు పాపారావు, కిరణ్ కుమార్, నాగభూషణం, సిడిపిఒ రంగలక్ష్మి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలపై వైద్యాధికారులు శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన గ్రామాలపై వైద్యాధికారులు శ్రద్ధ వహించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలో మారుమూల గిరిజన గ్రామం రెబ్బ గ్రామాన్ని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు తన వైద్య బృందంతో బుధవారం సందర్శించారు. గ్రామంలో ప్రజల ఆరోగ్య పరిస్థితులపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. అక్కడ నిర్వహించిన వైద్య శిబిరాన్ని తనిఖీ చేసి జ్వర లక్షణాలతో ఉన్న వారికి నిర్వహించిన రక్త పరీక్షలను, వాటి నివేదికలను పరిశీలించారు. వారికి తగు మందులు అందజేసి ప్రతి రోజూ పర్యవేక్షణ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మారుమూల గ్రామమైనందున అవసరమైన మందులు, పరీక్షలు గ్రామంలో అందుబాటులో ఉంచాలని, ఎప్పటికప్పుడు గ్రామంలో ఆరోగ్య సర్వే చేసి నివేదికలను విధిగా ఆరోగ్య కార్యాలయానికి తెలియజేయాలని సిబ్బందిని ఆదేశించారు. జ్వరాలను గుర్తించడంలో అలసత్వం వహిస్తే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్కడ ప్రజలతో డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ ఆరోగ్య పరంగా ఏ సమస్య వచ్చినా వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలని అవసరమైన మందులు, పరీక్షలు సిద్ధంగా ఉన్నాయన్నారు. తాగు నీటిని కాచి చల్లార్చి తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన దోమల ప్రభావిత ప్రదేశాలను పరిశీలించి, వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట పారిశుధ్య నిర్వహణ చేయించాలని పంచాయతీ సెక్రటరీ, సూపర్‌వైజర్లకు సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి బి.శామ్యూల్, ఎఎంఒ సూర్యనారాయణ, పంచాయతీ సెక్రటరీ బి.తారకరామారావు, సబ్ యూనిట్ అధికారి సిహెచ్.ధనుంజయరావు, సిహెచ్ఒ బంగారుబాబు, వైద్య సిబ్బంది బద్రినారాయణ, రామకష్ణ, స్వరాజ్య లక్ష్మి, రజని, తేజేశ్వరి, సురేష్, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.


పాతబస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

వైసిపి అధ్వాన పాలనకు రోడ్డే నిదర్శనం : టిడిపి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

వైసిపి పరిపాలనకు నియోజకవర్గంలో రహదారులే అద్దం పడుతున్నాయని పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయచంద్ర అన్నారు. బుధవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద ఛిద్రమైన రహదారుల దగ్గర టిడిపి కార్యకర్తలతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్వతీపురం పట్టణాన్ని గాలికి వదిలేశారని, ఫొటోలకు పోజులు ఇస్తున్నారు తప్ప అభివృద్ధి ఆమడ దూరంలో ఉంచారని అన్నారు. అభివృద్ధిలో పట్టణాన్ని అన్ని రంగాల్లో వెనక్కు నెట్టివేశారని, ప్రస్తుతం రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉండడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమరించారు. ఐదేళ్లయినా అధికారులు మాత్రం ఇంకా నిద్దురపోవడం గమనా ర్హమన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.వెంకట నాయుడు, పోల సత్యనారాయణ, బార్నాల సీతారాం, మజ్జి వెంకటేష్, బోను చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

హామీలను నూరు శాతం నెరవేర్చాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బలిజిపేట

పాదయాత్ర సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను శత శాతం నెరవేర్చి అమలుపర్చిన ప్రభుత్వం వైసిపిదేనని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. బుధవారం వెంగాపురంలో సచివాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైయస్‌ఆర్ ఆసరా నాలుగో విడత మండల స్థాయి ప్రారంభం కార్యక్రమంలో పాల్గొన్నారు. వైయస్‌ఆర్ ఆసరా పథకం ద్వారా ఈ 4 విడతలుగా రూ 30.41 కోట్ల మేర రుణమాఫీ చేయగా ఒక్క నాలుగో విడత ద్వారా మొత్తం 1315 స్వయం సహాయక సంఘాల్లో గల 14,789 మంది మహిళా సభ్యులకు రూ 7.59 కోట్లు నేడు వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చేతులు మీదుగా మహిళా సంఘాల సభ్యులకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి జి.నాగమణి, జెడ్పిటీసీ ఎ.రవికుమార్, వైస్ ఎంపిపిలు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి సీనియర్ నాయకులు, స్టేట్ డైరెక్టర్లు, ఎఎంసి డైరెక్టర్లు, పిఎసియే చైర్మన్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు, మహిళా లబ్ధిదారులు, స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తాగునీటి సదుపాయం కల్పించాలి

ప్రజాశక్తి -కొమరాడ

సెలం నీటిని పడుతున్న జల గ్రామ గిరిజనులు

పేరులో ఉన్న జలం గ్రామంలో లేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు వి.ఇందిరా అన్నారు. మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన జల గ్రామానికి తాగునీటి సదుపాయం కల్పించాలని కోరుతూ గ్రామంలో బుధవారం నేల బావి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరతో పాటు సిపిఎం, గిరిజన సంఘం నాయకులు కొల్లి సాంబమూర్తి, బాబురావు, చెంబరు మాట్లాడుతూ పెద్దశాఖ పంచాయతీ పరిధిలో జల గ్రామానికి మంచినీరు లేకపోవడంతో సమీప గెడ్డలో నుంచి బురద, కలుషిత నీరు తెచ్చుకొని వాడుక, తాగటానికి ఉపయోగించే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల ఇప్పటికే అనేకమంది గిరిజనులు జ్వరాల బారినపడ్డారన్నారు. వీరి ఇబ్బందులపై ఇప్పటికే కలెక్టర్, ఎంపిడిఒకు తెలిపినా పరిష్కారం చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సచివాలయం సిబ్బంది కూడా ఈ గ్రామాలకు మంచినీరు లేకపోవడంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జల గ్రామానికి మంచినీరు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పాచిపెంట : స్థానిక పిహెచ్‌సి సమీపాన గల రాచవీధికి సంబంధించి మోటారు పాడై ట్యాంకులో నీరు లేక 40 రోజులుగా తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆ వీధి మహిళలు అప్పల నరస, కాల లక్ష్మి, సత్య, ఎన్.సన్యాసమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ తాగునీటి సమస్యపై ఇదివరకే పంచాయతీ కార్యదర్శికి తెలిపినా నేటికీ మోటారు బాగు చేయలేదన్నారు. దీనివల్ల రాచవీధి, రెల్లివీధి, నల్లి వీధులకు సంబంధించి దాదాపు 250 కుటుంబాల పేద మహిళలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి చిన్నపాటి సమస్యలు పరిష్కారం కోసం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదని, ఈ సమస్య పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన చేపడతామని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి మోటారు బాగు చేయాలని విజ్ఞప్తి చేశారు.

తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కారు మబ్బులు కారణంగా జీడి, మామిడి పంటలకు తెగుళ్ళు సోకే అవకాశం ఉందని రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రకృతి వ్యవసాయ కో-ఆర్డినేటర్ కమిడి భూషణరావు సూచించారు. మండలంలోని ఎల్విన్‌పేట సవర కలిగొట్టు గ్రామ గిరిజన రైతులతో ప్రకృతి వ్యవసాయ పంటలపై అవగాహన కల్పించారు. జీడి, మామిడి తోటలకు వాతావరణం అనుకూలంగా లేని కారణంగా తెగుళ్ళు, పురుగులు ఆశించే అవకాశం ఉందన్నారు. అందుకు భూమిపై వేలాడే కొమ్మలను కత్తిరించుకోవాలన్నారు. చిగురుదశ, పూత దశ, పిందె దశ మాడిపోయి దిగుబడి తగ్గే అవకాశం ఉందని అన్నారు. అందుకు పుల్లటి మజ్జిగ, పంచగవ్య ద్రవ జీవమతం తో జీడి, మామిడి తోటలకు పిచికారి చేయలన్నారు. ఎక్కువ స్థాయిలో అంతర పంటలుగా పసుపు, అల్లం, పైనాపిల్, మినుములు వంటివి వేసుకుంటే మంచి అదనపు ఆదాయం వస్తుంది అన్నారు. కార్యక్రమంలో ఐసిఆర్ పి దీప పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని కౌన్సిలర్లు కోరారు. బుధవారం చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో కౌన్సిలర్లు జీవో అవర్ లో మాట్లాడారు. కౌన్సిలర్ గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎక్కడికక్కడ చెత్తకుప్పలు పేరుకుపోతున్నందున దోమలు వృద్ధి చెందుతున్నాయని చెప్పారు. దీనికి మిగిలిన కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్మోహన్ రావు, కౌన్సిలర్లు పప్పల లక్ష్మణరావు, జి.నాగేశ్వరరావు, బీసపు హైమావతి, జర్జాపు నీలిమ, పి.సన్యాసమ్మ, కమిషనర్ జయరాం, డిఇ శ్రీరామ్మూర్తి, ఎఇ సూరి నాయుడు పాల్గొన్నారు.

బీమా సాయం అందజేత

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మొండెంఖల్‌కు చెందిన లంక గోపినాధం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో నామిని అయిన ఆయన భార్య జయంతికి వైయస్సార్ బీమా తక్షణ సహాయం రూ.10వేలు సర్పంచ్ ఐ.గౌరీశంకర్, ఎంపిటిసి జి.విద్యారాణి, వెల్ఫేర్ అసిస్టెంట్ ఆనంద్ బుధవారం అందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటమని ధైర్యాన్నిచ్చి మిగతా రావాల్సిన బీమా డబ్బులు కూడా త్వరగా అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి అనిమ ఇందిరాకుమారి, వైసిపి నాయకులు రేవు సత్తిబాబు, వాలంటరీ పాల్గొన్నారు.

అభిలాష సామాజిక గ్రంథాలయాలు ఏర్పాటు

గుమ్మలక్ష్మీపురం : గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగులు, యువతను ప్రోత్సహిస్తూ పోటీ పరీక్షలకు సన్నద్ధమై విజేతలుగా నిలవడం కోసం అభిలాష సామాజిక గ్రంథాలయాలు కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేసినట్టు సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు, స్థానిక సర్పంచి బొత్తాడ గౌరీ శంకరరావు తెలిపారు. మండలంలోని గుమ్మలక్ష్మీపురం, మండ గ్రామ సచివాలయాల్లో అభిలాష సామాజిక గ్రంథాలయాలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా గమ్మలక్ష్మీపురంలో అభిలాష సామాజిక గ్రంథాలయాన్ని సర్పంచి ప్రారంభించారు. పోటీతత్వ పరీక్షలకు సంబంధించి 66 రకాల పుస్తకాలు నిరుద్యోగులకు అందుబాటులో ఉంచారు. ఇటీవల మధ్యకాలంలో టెట్, గ్రూప్-1, గ్రూప్-2 త్వరలో రానున్న డీఎస్సీ పరీక్షలకు, అన్ని రకాల పోటీ పరీక్షలకు సన్నద్ధమ వ్వాలని, ఈ సదవకాశాన్ని అందరూ వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

3న ఆసరా పంపిణీ

వీరఘట్టం : స్థానిక మహిళా సమైక్య కార్యాలయ ఆవరణలో ఈనెల 3న నాలుగో విడత వైయస్సార్ అసరా కానుక పంపిణీ చేయనున్నట్లు ఎపిఎం బి.శివున్నాయుడు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్ ఆధ్వర్యంలో పంపిణీ చేయనున్నారని ఎస్‌హెచ్‌జి గ్రూపు సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

క్రమశిక్షణతోనే చక్కని జీవితం

ప్రజాశక్తి - పార్వతీపురం

క్రమశిక్షణతో చక్కని జీవితం పొందొచ్చని జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి ఎంఎన్ రాణి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా బాలల సంరక్షణ విభాగం, మహిళా, శిశు సంక్షేశాఖ బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాలికలకు సంబంధించిన చట్టాలు గూర్చి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాణి మాట్లాడుతూ బాల్య వివాహాలు వల్ల కలిగే నష్టాలను, ఆరోగ్య పరంగా వచ్చే సమస్యలను వివరించారు. చదువుకునే వయస్సులో విద్యార్జన పట్ల శ్రద్ధ వహించాలని, జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. జిల్లా బాలల సంరక్షణాధికారి ఎ.సత్యనారాయణ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణపై అవగాహన కల్పించారు. చెడు, మంచి స్పర్శల గురించి అవగాహన కల్పించారు. కాలేజీ ప్రిన్సిపల్ మాట్లాడుతూ బాలికలంతా చదువుకొని తల్లదండ్రులకు, అధ్యాపకులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది, జిల్లా బాలల సంరక్షణ విభాగం సంరక్షణాధికారులు పి.శ్రీధర్, ఎన్.ప్రసాదరావు, ఎంఎ నాయుడు, సామాజిక కార్యకర్త ఎస్.దేవి, కౌన్సిలర్ జి.తవిటి నాయుడు, అవుట్ రీచ్ వర్కర్స్ ఆర్.హరికృష్ణ, బి.అనిల్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి - సీతంపేట

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. సీతంపేట సచివాలయం-1 పరిధిలో గల ఇళ్లకు వెళ్లి ఆయా కుటుంబాలకు ఈ నాలుగేళ్లలో ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తున్నామని, కావున ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గమనించాలని కోరారు. అలాగే పేదల చదువుకు పెద్దపీట వేస్తూ నాడు - నేడు ద్వారా సర్కారు బడులను కార్పొరేట్ పాఠశాలలుగా మార్చుతూ అన్ని మౌళిక వసతులు కల్పించామని అన్నారు. మహిళలకు వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ రుణాలు, లింకేజీ రుణాలు ఇస్తూ డ్వాకా మహిళలకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు. కార్యక్రమం ఎంపిపి బిడ్డిక ఆదినారాయణ, జెట్పీటీసీ సవర లక్ష్మి, స్థానిక సర్పంచ్ ఆరిక కళావతి, ఎంపిటిసి గొర్లె పగడాలమ్మ, పార్టీ ముఖ్య నాయకులు, మండలంలో గల సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది, గ్రామవాలంటీర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయిని విజయను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

విజయకు ఘన సన్మానం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చినబోగిలికి ఉపాధ్యాయులు కె.విజయ ఉద్యోగ విమరణ చేసిన సందర్భంగా ఆమెను స్థానికులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు మాట్లాడుతూ ఉద్యోగులు విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరిస్తే ప్రతి ఉద్యోగికి సమాజంలో గౌరవం ఉంటుందన్నారు. వృత్తిని అంకితభావంతో పనిచేసిన ప్రతి ఉద్యోగికి గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌సి కమిటీ సభ్యులు సవరపు జయమణి, మాజీ ఎమ్మెల్యే బి.చిరంజీవులు, ఎంపిపి ప్రతినిధి బి.శ్రీరామునాయులునాయుడు, వైసిపి నాయకులు ఆర్‌వి పార్థసారథి, సర్పంచి కురుమాన రాధా శ్రీనివాసరావు, యుటిఎఫ్‌చ ఎపిటిఎఫ్, పిఆర్‌టియు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేతనదారుల సంఖ్య పెంచాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో భాగంగా వేతనదారుల సంఖ్య పెంచాలని ఎపిఒ జి.సత్యంనాయుడు క్షేత్ర సహాయకులకు ఆదేశించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో క్షేత్ర సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎవరికైనా జాబ్ కార్డు లేకపోతే తక్షణ జాబు కార్డులను మంజూరు చేయాలని, ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

కులగణన సర్వే పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలం లోని పెదబోగిలి లో జరుగుతున్న కులగణన సర్వేను ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటికి కులగణన చేయాలన్నారు.

నేరాలు ఘోరాలు

గడ్డి మందు తాగి యువతి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో టొంపలపాడు సచివాలయం పరిధిలో గల గేదెలగూడకు చెందిన ఆరిక రావియ్య అనే (16) యువతి గడ్డి మందు తాగి ఆత్మహత్యానికి పాల్పడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఆమె కుటుంబ సభ్యులు నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా, అక్కడ వైద్య అధికారులు పి.అభినవ్‌కుమార్, అమర్‌సింహారెడ్డి ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆత్మహత్య ప్రయత్నానికి పాల్పడ్డానికి గల కారణాలు తెలియాల్సింది. నీలకంఠాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని డి-శిర్లాం పంచాయతీ పరిధిలోని ఇసుక రీచ్ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ పి.నరసింహమూర్తి తెలిపారు. ఎటువంటి అనుమతుల్లేకుండా రీచ్ వద్ద ఇసుకను లోడ్ చేస్తున్న ట్రాక్టర్లను బుధవారం స్థానిక ఎస్సై తమ సిబ్బందితో కలిసి వెళ్లి పట్టుకున్నారు. ఇందులో పుట్టూరుకు చెందిన ఒక ట్రాక్టర్, గంగవరం గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE PALAKONDA
O.S. 66/2019

Between: **Andhra Bank,Palakonda, Rep, by its Branch Manager.** ...Plaintiff
And: **Mamidi Appala Swamy(Died)& others** ...Defendants

To,
D-5 మామిడి రవి, S/o Late రామయ్య, వడమ గ్రామం, పాలకొండ మండలం, పార్వతీపురం-మన్యం జిల్లా (శ్రీకాకుళం జిల్లా)
D-6 మామిడి కాంత, S/o Late రామయ్య,
--Rest Do--

పై నెంబర్ దావాలో వాది తమ బ్యాంకుకు మీ సోదరుడు మామిడి అప్పలస్వామి తీసుకున్న ఋణం వసూలు నిమిత్తం వేసియున్నారు. సదరు దావాలో మీకు సమను నిమిత్తం **తే. 07-02-2024 దీన వాయిదా అయియున్నది.** కావున ఆ దినము పై కోర్టులో **ఉ॥ 10.30 గం॥ లకు** స్వయంగా గాని మీ తరుపు న్యాయవాది ద్వారా గాని పై కోర్టుకు హాజరు కావాలెను. లేనియెడల మిమ్ములను **Ex-Party** చేసి మీ పరోక్షమున కేసు విచారించి తీర్మానం జరుగునని ఈ నోటీసు ద్వారా మీకు తెలియజేస్తున్నాను.

గుడ్ల శంకరరావు
న్యాయవాది,
పాలకొండ
తేది: 31-01-2024
ఫోన్: 8639952743.